అంబర్‌పేట ప్రజల అండ మరువలేనిది

కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి


బాపునగర్ జీప్‌యాత్రలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: ప్రతి ఎన్నికల్లో అంబర్‌పేట ప్రజలు తనకు అండగా ఉన్నారని, ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో సైతం మద్దతుగా ఉండాలని కేంద్ర మంత్రి, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి కోరారు. శనివారం రాత్రి అంబర్‌పేట డివిజన్‌లోని కాకతీయలేన్, బాపునగర్, చెన్నారెడ్డినగర్, హనుమాన్‌నగర్, మైసయ్య హోటల్, నరేంద్ర నగర్‌ల మీదుగా అలీకేఫ్ చౌరస్తాల వరకు ఎన్నికల ప్రచారంలో భాగంగా జీప్ యాత్ర జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 20 ఏళ్లుగా అంబర్‌పేట ప్రజలతో తనకు అవినాభావ సంబంధం ఉందని ఆయన అన్నారు. ప్రతి ఎన్నికల్లో అంబర్‌పేట ప్రజలు తనను నిండు మనస్సుతో ఆశీర్వదించారని, ఈ ఎన్నికల్లో సైతం ప్రజలు ఆశీర్వదీస్తారని విశ్వాసం ఉందన్నారు. దేశ అభివృద్ధి, భవిష్యత్తులో అంబర్‌పేట ప్రజలు భాగస్వాము కావాలని ఆయన కోరారు. ఈ ప్రచారంలో మాజీ మంత్రి కృష్ణయాదవ్, మాజీ కార్పొరేటర్ వనం రమేష్, నాయకులు నాగభూషణంచారీ, యశ్వంత్, యాదగిరి, భిక్షపతి, కృష్ణముదిరాజ్, మైలారం రాజు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆన్‌లైన్ వేసవి భక్తి సంగీత శిక్షణ తరగతులు


మాట్లాడుతున్న గౌరీభట్ల వసుధామూర్తి

నల్లకుంట: శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం (నేటి) నుంచి ఆన్‌లైన్ వేసవి భక్తి సంగీత శిక్షణా తగతులు ప్రారంభమవుతాయని అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధా మూర్తి చెప్పారు. ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఆదివారం నల్లకుంటలోని అకాడమీలో ఆమె మాట్లాడుతూ..ఆన్‌లైన్ తరగతుల వివరాలను వెల్లడించారు. సోమవారం నుంచి మే 24వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రెండు బ్యాచ్‌ల్లో శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఐదు నుంచి 15 ఏళ్ల లోపు వయసు చిన్నారులకు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు 16 ఏళ్లు పైబడిన వారికి శిక్షణ ఉంటుందన్నారు. ఇందులో భక్తి గీతాలు, అన్నమయ్య కీర్తనల బృంద గానంలో శిక్షణ ఉంటుందని చెప్పారు. అలాగే సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు అన్ని వయసుల వారికి కర్ణాటక సంగీతంలో బేసిక్స్, సినిమా భక్తి గీతాల్లో శిక్షణ ఉంటుందని చెప్పారు. ఆలిండియా రేడియో, టీవీ కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణామూర్తి పర్యవేక్షణలో శిక్షణ ఉంటుందని చెప్పారు. దీనికి వర్ధమాన గాయినీమణులు యామిని, నందినిలు ఈవెంట్ మేనేజర్లుగా వ్యవహరిస్తారన్నారు. తాళ్లపాక అన్నమయ్య జయంతిని పురస్కరించుకొని మే 23న శిల్పారామంలో 'సామూహిక సంకీర్తనార్చన' నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికేట్లు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 83749 27736 లో సంప్రదించవచ్చు.

పద్మారావుగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ముఠా జైసింహ

ముషీరాబాద్: సికింద్రాబాద్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ కోరారు. ఆదివారం సాయంత్రం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ కమిటీ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో డివిజన్ బీఆర్ఎస్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముఠా జైసింహ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు లభించిన మెజార్టీ కంటే పద్మారావుకు అత్యధిక మెజార్టీ లభించేలా పార్టీ నాయకులు అంకిత భావంతో పని చేయాలన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చేలా ప్రతి బస్తీ, కాలనీలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలకు బీఆర్ఎస్‌ను మరింత చేరువ చేయాలని సూచించారు. అనంతరం వై.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ భోలక్‌పూర్‌లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేస్తూ సికింద్రాబాద్ పార్లమెంటు అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు అత్యధిక ఓట్లు దక్కేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శులు షరీఫ్, రహీం, పార్టీ సీనియర్ నాయకులు రెబ్బరామారావు, షకీల్, డివిజన్ మాజీ అధ్యక్షులు మహ్మద్ ఆలీ, డివిజన్ బీసీ సెల్ అధ్యక్షులు ఉమాకాంత్, మైనార్టీ కమిటి నాయకులు మున్వర్‌చాంద్, బాలర్‌హుస్సేన్, అబ్రార్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సీతారాముల బ్రహ్మోత్సవాలు


సీతారాముల ఉత్సవ విగ్రహాలను రథంపై నల్లకుంట పురవీధుల్లో ఊరేగిస్తున్న దృశ్యం

నల్లకుంట: న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి ఆలయంలో ఈ నెల 13న ప్రారంభమైన సీతారాముల బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం బలిహరణం కావించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో అర్చక స్వాములు హోమం నిర్వహించారు. సుందరకాండ పారాయణం చేశారు. అంతకుముందు సీతారాములకు సుప్రభాత సేవ, విశేషపూజలు నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు విశేష పూజలందుకున్న సీతారామాంజనేయ లక్ష్మణ సహిత ఉత్సవ మూర్తులను రథంపై నల్లకుంట పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా స్థానికులు పురవీధుల్లో ఊరేగుతూ వచ్చిన ఇష్టదైవాలకు పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగింది.

పేదల బతుకులో అతడు అన్నం మెతుకు!

స్కాలర్‌షిప్‌తో పేదల కడుపునింపుతున్న పీజీ విద్యార్థి


లిబర్టీ వద్ద పేదలకు అల్పాహారం అందజేస్తున్న ఇటిక్యాల గణేష్

లిబర్టీ: అతడు మనుసున్న మహారాజు కాదు, మానవీయత మూర్తీభవించిన మామూలు విద్యార్థి. అన్నార్తుల కంచంలో అన్నం మెతుకై నిలిచాడు. అతడు ఆకలిబాధ తెలిసిన సహృదయుడు. పేదల ఆకలి కేకలకు స్పందించి తనకు తోచినవిధంగా కడుపునింపుతున్నాడు. తనకు వచ్చే స్కాలర్‌షిప్‌ను వారి కోసమే వెచ్చిస్తున్నాడు. పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తున్న ఇటిక్యాల గణేష్ పేదల ఆకలి తీర్చడంతోపాటు అక్కున చేర్చుకుంటున్నాడు. రైల్వే స్టేషన్‌లు, మెట్రోరైలు స్టేషన్లు, ఫుట్‌పాత్‌లు, చెట్ల కింద జీవనం సాగిస్తున్న కూలీలకు, మహిళలకు, పేదలకు ప్రధానంగా వృద్ధులకు ఉదయం పూట అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రివేళల్లో భోజనం, మంచినీళ్ల బాటిల్స్ అందిస్తున్నాడు. లిబర్టీ, ఆదర్శనగర్, సాయిబాబా బ్యాక్‌లైన్, బషీర్‌బాగ్, నాంపల్లి తదితర ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న వారికి తనవంతు చేయూతనందిస్తున్నాడు. తనకు వచ్చే స్కాలర్‌షిప్‌తో పేదలకు సేవ చేయడం అభినందనీయమని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాగేశ్వర్‌రావుకు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేటిక్స్ విభాగం నుంచి జిల్లపల్లి నాగేశ్వర్‌రావు పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. సీనియర్ అధ్యాపకులు ప్రొ.వీబీ నరసింహా పర్యవేక్షణలో ఇంప్లిమెంటేషన్ ఆఫ్ డీప్ లెర్నింగ్ అండ్ కంప్రెషన్ టెక్నిక్స్ ఆన్ హెల్త్ కేర్ సిస్టం ఫర్ ఇంప్రూవ్ డేటా స్టోరేజ్ ఎఫిషైన్సీ అనే అంశం పై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది.

భర్తతో గొడవపడి గర్భిణి అదృశ్యం

ఉప్పల్: భర్తతో గొడవ పడి ఓ గర్భిణీ అదృశ్యమైంది. ఈ సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. రామంతాపూర్ వెంకటరెడ్డినగర్ ప్రాంతానికి చెందిన సాయి పవన్, అనుష(26)లకు సంవత్సరం క్రితం వివాహం జరిగింది. ప్రస్తుతం అనుష అరు నెలల గర్భిణి. పుట్టింటికి వెళతానని భర్తతో చెప్పగా భర్త అందుకు అంగీకరించ లేదు. దీంతో భర్త బయటకు వెల్లగా ఇంట్లో నుంచి చెప్పకుండా వెళ్లిపోయింది. పుట్టింటికి కూడా వెళ్లలేదు. దీంతో అనుష తండ్రి ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

భార్యతో గొడవ పడి భర్త అదృశ్యం

రామంతాపూర్ ఆర్టీసీ కాలనీకి చెందిన లక్ష్మణ్ (36), భార్య కవితలు ఈ నెల 18 న గొడవపడ్డారు.దీంతో కవిత పుట్టింటికి వెళ్లిపోయింది. తిరిగి 20 న ఇంటికి రావడంతో అప్పటికే భర్త ఇంట్లో లేడు. ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుంది. దీంతో కవిత ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

'ఎర్లీబర్డ్'.. ఇంకా తొమ్మిదిరోజులే..

- ఆస్తిపన్ను చెల్లింపునకు ఐదు శాతం రాయితీ
- ఖైరతాబాద్‌లో మంచి స్పందన



ఆస్తిపన్ను భారీగా వసూలు చేసిన సిబ్బందిని అభినందిస్తున్న అధికారులు(ఫైల్)

బంజారాహిల్స్: ఐదు శాతం రాయితీతో 'ఎర్లీ బర్డ్'పథకం కింద చెల్లింపులకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించినవారికి రాయితీ సౌకర్యాన్ని అందజేయడమే కాకుండా ఈ పథకాన్ని విస్తృతంగా ప్రచారం చేసి చెల్లింపుదారులకు అవగాహన కల్పించారు. ఖైరతాబాద్ సర్కిల్-17 పరిధి కిందికి వచ్చే సోమాజిగూడ, ఖైరతాబాద్, సర్కిల్-18 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్ల పరిధిలో ఎర్లీబర్డ్ పథకానికి మంచి స్పందన లభిస్తోంది. ఈ రాయితీకి ఇంకా తొమ్మిది రోజులు మాత్రమే గడువు ఉండటంతో సెలవు రోజుల్లో సైతం పన్నుల చెల్లింపులకు అధికారులు అవకాశం కల్పించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ పథకం కింద ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఇప్పటికే లక్ష్యం దిశగా పన్నులు వసూలు చేశారు. సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నం కావడంతో వసూళ్లలో కొంత జాప్యం చోటుచేసుకుంటుంది. అయినా సరే అధికారులు మాత్రం పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు.

లక్ష్యంగా దిశగా...

ఈ తొమ్మిది రోజులు మరింతగా పన్నులు వసూలు చేయాలని అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. సర్కిల్-18 పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లపై సిబ్బంది దృష్టి కేంద్రీకరించి లక్ష్యం దిశగా ముందుకుసాగగా, వీరందరిని అధికారులు ప్రత్యేకంగా సన్మానించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను మార్చి 31వ తేదీ వరకు ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలో రూ.170 కోట్లు, జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలో 213 కోట్లు వసూలయ్యాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూస్తే ఈసారి అధికంగా పన్ను వసూలు చేశారు. జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలో గత ఆర్థిక సంవత్సరంలో రూ.184 కోట్లు మాత్రమే వసూలు చేయగా, ఈసారి రూ.213 కోట్లు వసూలు చేశారు. ఒక్క మార్చిలో ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలో రూ.51 కోట్లు, జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలో రూ.39 కోట్లు వసూలయ్యాయి.

పథకంపై విస్తృత అవగాహన: డీఎంసీ

ఎర్లీబర్డ్ పథకానికి కూడా ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని జీహెచ్ఎంసీ సర్కిల్-18 డీఎంసీ ప్రశాంతి తెలిపారు. ఇంకో తొమ్మిది రోజులు ఉన్న గడువును వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ పథకంపై ఇప్పటికే అవగాహన కార్యక్రమాలతోపాటు ప్రయోజనాలను వివరిస్తూ ప్రజలకు తెలియజేసినట్లు చెప్పారు.

శుభాకాంక్షలు


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

ముషీరాబాద్: అడిక్‌మెంట్ డివిజన్ నాగమయ్య కుంటకు చెందిన ప్రణయతేజ, శ్రవణ్‌కుమార్‌ల వివాహం నాగోల్‌లోని ఈవెంట్ విల్లాలో జరిగింది. ఈ వివాహానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట ప్రవీణ్, అవినాష్ తదితరులు ఉన్నారు.

కిషన్‌రెడ్డి గెలుపు కోసం ఎమ్మార్పీఎస్ ప్రచారం

ముషీరాబాద్: సికింద్రాబాద్ బీజేపీ పార్లమెంటు అభ్యర్థి జి.కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ముషీరాబాద్ నియోజకవర్గం రాంనగర్ డివిజన్‌లోని కృష్ణానగర్ బస్తీలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చట్టబద్ధత కోసం జరుగుతున్న మాదిగ దండోరా ఉద్యమంలో మాదిగలకు గత 30 ఏళ్లుగా తోడుగా, అండగా ఉంటున్న కిషన్‌రెడ్డికి మాదిగలంతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు చిలుక ఎల్లయ్య, సిద్ధంకి దుర్గాప్రసాద్, ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ గజ్జల రాజశేఖర్ మాదిగ, రాములు, నర్సింహ్మా పాల్గొన్నారు.

దానం గెలుపు ఖాయం


హరీష్ గౌడ్‌ను సన్మానిస్తున్న దానం నాగేందర్

నల్లకుంట: కాంగ్రెస్ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపు ఖాయమని టీపీసీసీ కార్యదర్శి జీవీ హరీష్ గౌడ్ అన్నారు. ఆదివారం సాయంత్రం హరీష్‌గౌడ్ అంబర్‌పేట నియోజక వర్గానికి చెందిన పార్టీ నాయకులతో కలిసి దానంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీష్‌గౌడ్‌ను శాలువాతో సన్మానించిన దానం తన గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు.

రైల్లో ల్యాప్‌టాప్ చోరీ

కాచిగూడ: కడప జిల్లా కమలాపురం మండలానికి చెందిన వెంకటరమణారెడ్డి నగరంలోని పోచారంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు ఎర్రగుంట్ల వద్ద ఎక్కి కాచిగూడలో దిగాడు. రైలు ఆగుతున్న సమయంలో బాత్‌రూమ్‌కు వెళ్లి వచ్చేసరికి సీటు వద్ద పెట్టిన ల్యాప్‌టాప్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. ఆదివారం వెంకటరమణారెడ్డి కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

లాలాపేట: హనుమాన్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని హిందూ వాహిని నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం లాలాపేటలోని శివాలయం ఆవరణలో ఈ నెల 23న లాలాపేటలో నిర్వహించనున్న హనుమాన్ జయంతి వేడుకలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉదయం 8 గంటలకు లాలాపేట ఇసుకబాయి నుంచి తాడ్‌బండ్ ఆంజనేయ దేవాలయం వరకు నిర్వహించే బైక్ ర్యాలీలో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు.

నేడు కవాడిగూడలో పద్మారావుగౌడ్ పాదయాత్ర

హనుమాన్ టెంపుల్‌లో ప్రత్యేక పూజలు


ముచ్చకుర్తి ప్రభాకర్

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ కొత్తబజార్ మేయిన్‌రోడ్డులో గల హనుమాన్ దేవాలయం నుండి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్ ఎన్నికల పాదయాత్ర సోమవారం ప్రారంభమవుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముషీరాబాద్ బీఆర్ఎస్ మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 22 సాయంత్రం 4.30 గంటలకు హనుమాన్ టెంపుల్‌లో పూజలు నిర్వహించిన అనంతరం కవాడిగూడ డివిజన్‌లోని కొత్తబజార్, మజీద్‌లైన్, ముగ్గుబస్తీ, సింగాడికుంట, ఉన్నికోట, చిత్రాల్‌నగర్, భవానీ నగర్, బండమైసమ్మ నగర్, దోమలగూడ పార్క్‌లో పాదయాత్ర జరుగుతుందని తెలిపారు. ఈ పాదయాత్రలో నియోజకవర్గంలోని ఆరు డివిజన్‌ల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నేతలు, బూత్ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఘనంగా జైనుల శోభాయాత్ర


జైనుల శోభాయాత్రలో పాల్గొన్న దిడ్డి రాంబాబు

కాచిగూడ: మహవీర్ జయంతిని పురస్కరించుకుని కాచిగూడలో పెద్ద ఎత్తున జైనులు శోభాయాత్ర నిర్వహించారు. జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్, కాంగ్రెస్ సీనియర్ నేత దిడ్డి రాంబాబు శోభాయాత్రకు స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ జైనులు సమాజ శ్రేయస్సుకు ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. పేద, బడుగు బలహీన వర్గాల కోసం వారు తరచూ నిర్వహిస్తున్న సామాజిక కార్యక్రమాలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. జైనుల ఆధ్వర్యంలో కొనసాగే పలు సేవా సంస్థలు పేదలకు వరంగా మారాయని పేర్కొన్నారు. కాచిగూడలోని జైన్ మందిర్‌లో జైనులు, భక్తులు ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

మాతావాకర్స్ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం


మాతావాకర్స్ క్లబ్ అధ్యక్షులు వై.మురళీధరుడు, గాయత్రీప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాజిక సేవలో భాగంగా మాతా వాకర్స్ క్లబ్ చేస్తున్న పలు సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.పుల్లయ్య, కార్యదర్శి రంగయ్య అన్నారు. ఆదివారం పద్మకాలనీ కమ్యూనిటీ హాల్‌లో మాతా వాకర్స్ క్లబ్ చేస్తున్న సేవలను కొనియాడుతూ ఆ సంస్థ అధ్యక్షుడు వై.మురళీధరుడు, గాయత్రీప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చిక్కడపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి లక్ష్మణ్‌సింగ్, భవానీ, వి.మోహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అల్పాహారాన్ని పంపిణీ చేశారు.

అంతరించిపోతున్న బుర్రకథ కళను పరిరక్షించాలి

లాలాపేట: ఉమ్మడి రాష్ట్రం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో బుర్రకథ సామ్రాట్‌గా ప్రసిద్ధి చెందిన గొప్ప కళాకారుడు రత్నం అని పలువురు కొనియాడారు. ఆదివారం తార్నాక డివిజన్ లాలాపేట వినోభానగర్‌లో బుర్రకథ సామ్రాట్ బి. రత్నం 7వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. రత్నం చిత్రపటానికి పలువురు నాయకులు, కళాకారులు పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. గీతాలు ఆలపించారు. అంతరించిపోతున్న బుర్రకథ కళను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆసక్తి కల్గిన వారికి బుర్రకథలో శిక్షణ ఇచ్చేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ప్రభుత్వాలు సైతం బుర్ర కథ కళాకారులను గుర్తించి ప్రోత్సహించాలని వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 100 మంది కళాకారులను శాలువాతో, మెమొంటోతో నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సినీ గేయ రచయిత మాస్టార్జీ, బి.యాదగిరి, బి. కిషన్ తదితరులున్నారు.

మహిళా మోర్చా అధ్యక్షురాలిగా బండి పద్మ

రామంతపూర్: మేడ్చల్ మల్కాజగిరి జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా రామంతపూర్‌కు చెందిన బండి పద్మ నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం మహిళా మోర్చా విభాగం జారీ చేసిన నియామక పత్రాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌తో కలిసి కార్పొరేటర్ బండారు శ్రీవాణి ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ.. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన కన్వీనర్ మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

ఆలయ హుండీల చోరీ

రామంతపూర్: జాతీయ రహదారి దగ్గర పెద్ద చెరువు కట్టపై ఉన్న శ్రీకట్ట మైసమ్మ ఆలయంలో మూడు హుండీలు ఆదివారం వేకువ జామున చోరీకి గురైనట్లు ఆలయ చైర్మన్ బండారి వెంకట్రావు తెలిపారు. భక్తులు హుండీలో వేసే కానుకలను, డబ్బులను ప్రతి మూడు నెలలకు ఒకసారి లెక్కిస్తామని తెలిపారు. సుమారు రూ. 70 వేలు చోరీకి గురైనట్లు పేర్కొన్నారు. మంగళవారం నుండి కట్ట మైసమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తుండగా ఈ సంఘటన జరగడంతో దిగ్భ్రాంతికి గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు.

'పురోహితులను అవమానిస్తే సహించం'

నల్లకుంట: పురోహితులు, పూజారులను అవమానిస్తే సహించేది లేదని తెలంగాణ బీజేపీ ధార్మిక పరిషత్ కన్వీనర్ సూర్యప్రకాష్ అన్నావఝుల ఆదివారం ప్రకటనలో హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పిఠాపురం మూలంపేటలో ఇటీవల ఓ జంటకు వివాహం నిర్వహిస్తున్న పురోహితుడు ఆచెళ్ల సూర్యనారాయణమూర్తి శర్మపై జరిగిన దాడి ఘటన అవమానకరమని, ఇది సభ్యసమాజం తల దించుకునేలా ఉందన్నారు. అంతేకాకుండా పురోహితుడిపై దాడి చేసిన దృశ్యాలను చేసి సోషల్ మీడియాలో వైరల్ చేయడం చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇటువంటి దాడులను తెలంగాణ ధార్మిక పరిషత్ అడ్డుకుని, పూజారులు, పురోహితులకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి పురోహితుడిపై దాడికి పాల్పడిన దుండగులను వెంటనే ఆరెస్టు చేసి, చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రేపు హనుమాన్ జన్మోత్సవ్ బైక్ ర్యాలీ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లక్ష్మణ్‌రావు

కాచిగూడ: హనుమాన్ జన్మోత్సవ్ సందర్భంగా భజరంగ్ సేన ఆధ్వర్యంలో ఈ నెల 23న హనుమాన్ వ్యాయామశాల నుంచి తాడ్‌బన్ హనుమాన్ మందిర్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్నట్లు భజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్.లక్ష్మణ్‌రావు తెలిపారు. ఆదివారం కాచిగూడలోని భజరంగ్ సేన రాష్ట్ర కార్యాలయంలో అడ్వయిజర్ వినయ్ తివారితో కలిసి ఆయన బైక్ ర్యాలీ పోస్టర్ ఆవిష్కరించారు. ఉదయం పది గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని, ర్యాలీ అనంతరం మాహాహారతి ఉంటుందని తెలిపారు. హిందూ బంధువులందరూ అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సునీల్ అగర్వాల్, మనోజ్ అభియాన్, రవి, రమేశ్వర్, వీరేందర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయం ఖాయం


దానం నాగేందర్‌ను కలిసి మద్దతు తెలియజేస్తున్న అభిషేక్‌రెడ్డి

ముషీరాబాద్: సికింద్రాబాద్ పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ తప్పకుండా విజయం సాధిస్తారని మాజీ ముఖ్యమంత్రి టి.అంజయ్య మనవడు, టీపీసీసీ ప్రచార కార్యదర్శి అభిషేక్‌రెడ్డి అన్నారు. ఆదివారం ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతలు అభ్యర్థి దానం నాగేందర్‌ను కలిశారు. అనంతరం అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్ల మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని ప్రజలందరూ కాంగ్రెస్ వైపు ముఖ్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. బీజేపీ పాలనలో ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీలు అభద్రతాభావానికి గురవుతున్నారని వారంతా కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ రాజు, సమద్, వేణుబాబుగౌడ్, వై.శ్రీనివాస్, శ్రీకాంత్, బల్వంత్, రషీదుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల 'అపూర్వ' సమ్మేళనం


పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

కాచిగూడ: గోల్నాక, వినాయక్‌నగర్‌లోని ముంతాజ్ హైస్కూల్‌లో 2000-2001 వ సంవత్సరం బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పి, విజ్ఞానాన్ని పెంపొందించిన సంస్కారవంతమైన పౌరులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను కళాశాల యాజమాన్యాన్ని పూర్వ విద్యార్థులు అభినందించారు. అప్పటి విద్యార్థులు పాల్గొని తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సంతోషం వ్యక్తం చేశారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహ్మద్ హిదాయత్ ఆలీఖాన్, మన్సూర్ ఆలీఖాన్, రవూఫుద్దీన్, అన్వర్ పాషా, వర్ష, సునిత, వెంకటేష్, సత్యం, శంకర్‌లను సన్మానించారు. కార్యక్రమంలో సుశీల, శ్రీలత, బాలలక్ష్మీ, బాలరాజ్, శివ, రమేష్, రవి, ప్రశాంత్, కిషోర్, యాదగిరి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

లిబర్టీ: రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ విజ్ఞప్తి చేశారు. మహత్తర ఆశయంతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం రచించి దేశానికి అందించారని ఆయన పేర్కొన్నారు. మాల మహానాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని ఆరోపించారు.

నోటీసులు ఇవ్వకుండా ఇంటిని కూల్చారు

బంజారాహిల్స్: ఇంట్లో తాము లేని సమయంలో వాచ్‌మెన్‌ను షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు బెదిరించి తాళం పగులగొట్టి ఇంటిని ధ్వంసం చేశారని యజమాని వి.సునీల్‌రెడ్డి ఆరోపించారు. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎమ్మెల్యే కాలనీలో వెయ్యి గజాలస్థలాన్ని కొనుగోలు చేశానని, అందులో 1982లో అనుమతులతో ఇంటిని నిర్మించానని, అప్పటినుంచి ప్రాపర్టీ ట్యాక్స్ కూడా కడుతున్నానని వెల్లడించారు. ఈ విషయమై ల్యాండ్ గ్రాబింగ్ స్పెషల్ కోర్టు కూడా తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని చెప్పారు. హైకోర్ట్, సుప్రీంకోర్ట్ నుంచి కూడా అనుకూలంగా తీర్పులు వచ్చాయని పేర్కొన్నారు. అయితే షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు తాము నివసిస్తున్న ఇంటిపై స్టే ఆర్డర్ ఉన్నా లెక్కచేయకుండా నోటీసులు ఇవ్వకుండా కూల్చివేశారని దుయ్యబట్టారు. సీసీ కెమెరాలు, విలువైన సామాన్లు, డాక్యుమెంట్లు ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

'బీజేపీకి గుణపాఠం చెప్పాలి'

లిబర్టీ: లోక్‌సభ ఎన్నికల్లో బీసీ వ్యతిరేక పార్టీలను గద్దెదించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దండ్రు కుమారస్వామి కోరారు. బీసీల పట్ల నిర్లక్ష్యంగా ఉదాసీనంగా వ్యవహరించిన కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు బీసీలు నిద్రపోకూడదని విజ్ఞప్తి చేశారు. దళ్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.